క్లుప్తంగా

భోగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేకాలంకరణలో త్రిపురాంబదేవి

గడివేముల: మండల పరిధిలోని దక్షిణ కాశీగా పిలువబడే దుర్గాభోగేశ్వరాలయంలో శుక్రవారం శ్రావణ మాసం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు శ్యాం సుందర్‌శర్మ, గిరినాథశర్మ తెలిపారు. తెల్లవారుజామునుంచే స్వామి, అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చారు. స్వామి, అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు, కుంకుమార్చన పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించడంతో పాటు స్థానిక కాశిరెడ్డినాయన ఆశ్రమంలో ఉచితంగా భోజన సౌకర్యం కల్పించారు.

ఈ–క్రాప్ నమోదు చేయించుకోండి

గడివేముల: మండలంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేసిన ప్రతి పంటను ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి హేమసుందర్ రెడ్డి సూచించారు. ఆయన శుక్రవారం గడిగరేవుల, దుర్వేశి గ్రామాలలో జరుగుతున్న ఈ–క్రాప్ నమోదును పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ.. పంట నమోదు చేయించుకుంటే ప్రభుత్వం అందించే పథకాల ద్వారా లబ్ధి పొందవచ్చని వివరించారు. రైతులందరూ సెప్టెంబర్ 15వ తేదీలోగా ఆయా గ్రామాలలోని ఆర్బీకేలో వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి పంట నమోదు చేయించుకోవాలని సూచించారు.

రీసర్వేతో భూ సమస్యల పరిష్కారం


అనుగొండలో రైతులనుద్దేశించి మాట్లాడుతున్న తహసీల్దార్ జయన్న

కోడుమూరు రూరల్: భూముల రీసర్వేతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ జయన్న అన్నారు. శుక్రవారం అనుగొండ, ముడుమలగుర్తి గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఆయన రైతులకు భూ రీసర్వేపై అవగాహన కల్పించారు. రైతులంతా రెవెన్యూ సిబ్బందికి, సర్వేయర్లకు సహకరించాలని కోరారు.

అవార్డు గ్రహీతకు సన్మానం


వర్క్ ఇన్‌స్పెక్టర్ రామేశ్వరరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

కోడుమూరు: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా అధికారుల నుంచి ఉత్తమ వర్క్ ఇన్‌స్పెక్టర్ అవార్డు అందుకున్న రామేశ్వరరెడ్డిని శుక్రవారం ఎల్ఎల్‌సీ సబ్ డివిజన్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఎల్ఎల్‌సీ సబ్ డివిజన్ డీఈఈ సుబ్బారాయుడు, జేఈలు సూర్యప్రకాష్, లక్ష్మన్న, మోహన్‌రావు, వర్క్ చార్జ్‌డ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి మగ్బుల్‌బాషా తదితరులు శాలువాతో సత్కరించారు.

పదోన్నతిపై ఎస్‌ఐ బదిలీ

గూడూరు: గూడూరు ఎస్‌ఐ వై.పవన్‌కుమార్ సీఐగా పదోన్నతిపై బదిలీ అయ్యారు. సి.బెళగల్ ఎస్‌ఐ పీరయ్యకు ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇచ్చి పవన్‌కుమార్ రిలీవ్ అయ్యారు. ఇక్కడికి ఎస్‌ఐగా మధుసూదన్‌రావ్ వచ్చే అవకాశాలున్నట్లు సిబ్బంది తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గోమాతకు పూజలు


గోవుకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు

సి.బెళగల్: మండల పరిధిలోని బురాన్‌దొడ్డి గ్రామంలో మహిళలు భక్తిశ్రద్ధలతో గోమాతకు పూజలు నిర్వహించారు. తిరుపతి తిరుమల దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గ్రామంలోని శివరామాలయంలో ప్రత్యేక పూజ, భజన, మహాభారత, రామాయణం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు శుక్రవారం ఏర్పాటు చేశారు. అందులో భాగంగా ఆలయంలో మహిళలు పెద్ద ఎత్తున కుంకుమార్చన, గోపూజ నిర్వహించారు. గోవుకు పసుపు, కుంకుమ పూజి ఊరేగించారు. గో సంరక్షణ అందరి బాధ్యత అని నిర్వాహకులు అన్నారు. కార్యక్రమంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ సభ్యులు రామసుబ్బారెడ్డి, ఆలయ ధర్మకర్త విరూపాక్షరెడ్డి, ధర్మాచార్యులు సోమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పశుసంపద.. కాస్త జాగ్రత్త

- సీజనల్ వ్యాధుల నుంచి పశువులను కాపాడుకోవాలి
- నిర్లక్ష్యం వహిస్తే జీవాల ప్రాణానికే ప్రమాదం
- 1962కు ఫోన్ చేస్తే ఇంటి వద్దకే పశువైద్య సేవలు


పెసరవాయిలో ఆవుకు టీకా వేస్తున్న డాక్టర్

గడివేముల: వర్షాకాలంలో పశువుల్లో వ్యాధులు ప్రబలే అవకాశం అధికం. ఈ సీజన్‌లో వచ్చే వ్యాధులు సాధారణమైనవే అయినా పాడిపై తీవ్ర ప్రభావం చూపుతాయి. పాడి రైతులు ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా వాటి ప్రాణాలకే ప్రమాదం వాటిల్లవచ్చు. దీంతో పాడి రైతులు, గొర్రెలు, మేకల పెంపకందార్లు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యులు సూచిస్తున్నారు. జీవాలు ప్రమాదకర పరిస్థితిలో ఉంటే వెంటనే 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా వాహనంతో వైద్యులే ఇంటికి వచ్చి మరీ చికిత్స అందిస్తారని చెబుతున్నారు.

గాలికుంటు వ్యాధిపై అప్రమత్తం

గాలికుంటు వ్యాధి ఆవులు, ఎద్దులు, గేదెలు వంటి వాటికి ఎక్కువగా సోకుతుంది. వ్యాధి బారిన పడిన పశువు శరీర ఉష్ణోగ్రత 104 నుంచి 105 డిగ్రీలకు పెరుగుతుంది. పశువు నోట్లో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. ఆహారం సరిగా తీసుకోలేవు. దీంతో నీరసంగా మారి నడిచేందుకు కూడా కష్టపడతాయి. పాడి పశువుల్లో అయితే పాల ఉత్పత్తి గణనీయంగా పడిపోతుంది. వ్యాధి నివారణ కోసం వైద్యుల సూచన మేరకు యాంటీబయాటిక్స్, పెయిన్ కిల్లర్స్ తదితర మందులను వాడాల్సి ఉంటుంది.

కలుషిత నీటితో జలగ వ్యాధి

మురుగు కాల్వల్లోని కలుషిత నీరు తాగడం వల్ల పశువులకు ఎక్కువగా ఈ వ్యాధి సోకుతుంది. ముఖ్యంగా గేదెలు, దూడలు, గొర్రెలు, మేకల వంటి జీవాలకు వస్తుంది. మేత తినడంలో పశువులు బాగా ఇబ్బంది పడతాయి. పాల దిగుబడి క్షీణిస్తుంది. జలగ వ్యాధి బారిన పడిన పశువును మంద నుంచి వేరు చేయాలి. డిస్టోడిన్ 4 మాత్రలు, 100 మిల్లీలీటర్ల నీయోజడ ప్లస్‌ను అందించాలి.

నట్టల వ్యాధితో ఎదుగుదలకు బ్రేక్

పశువులు పచ్చిమేత తిన్నప్పుడు నులి పురుగుల సమస్య వస్తుంది. దీంతో వాటి ఎదుగుదలకు అవకాశం ఉండదు. జీవాలు తిన్న ఆహారమంతా నులి పురుగులే స్వాహా చేస్తాయి. దీంతో జీవాలు తరచూ రోగాల బారిన పడే అవకాశం ఉంది. వఎక్కువగా గొర్రెలు ఈ వ్యాధి బారిన పడతాయి. ఎందుకంటే వర్షాలు పడి అక్కడక్కడ పెరిగే పచ్చి మేతను తిన్నపుడు ఈ సమస్య ఉత్పన్నమవుతుంది. అందుకే ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యగా ఆరు నెలలకోసారి పశువులకు నట్టల నివారణ మందులు ఉచితంగా అందిస్తోంది.

ఇటాస్ వ్యాక్సిన్‌తో చిటుకు వ్యాధికి చెక్

వర్షాకాలంలో పశువులకు ఎక్కువగా వచ్చే వ్యాధుల్లో చిటుకు ఒకటి. ఇది సోకినపుడు జ్వరం తీవ్రత ఎక్కువగా ఉంటుంది. నివారణ కోసం జూలై, ఆగస్టు మాసాల్లో ఇటాస్ వ్యాక్సిన్ వేస్తారు. రైతులు పశువులకు సంబంధించి వ్యాధులను సకాలంలో గుర్తించి తగిన వైద్యం అందించడం వల్ల వాటిని నివారించవచ్చు.

గొంతువాపు ప్రాణాంతకం

పశువులకు సంక్రమించే వ్యాధుల్లో గొంతువాపు వ్యాధి ప్రాణాంతకమైనది. ఈ వ్యాధి బారిన పడిన పశువుల కంటి నుంచి నీరు కారడం, నోటి నుంచి చొంగ వచ్చి శ్వాస పీల్చడానికి ఇబ్బందులు పడుతుంటాయి. గొంతు కిందకు నీరు దిగి గొంతు వాపు వస్తుంది. తీవ్రత ఎక్కువైతే పశువులు చనిపోయే ప్రమాదం ఉంది. వ్యాధి నియంత్రణకు హెచ్ఎస్ టీకాలు వేస్తారు. వ్యాధి బారిన పడిన పశువులను మంద నుంచి వేరు చేసి వైద్యుల సూచన మేరకు మందులు అందించాలి.

మండలంలోని పశు సంపద వివరాలు	
తెల్లజాతి పశువులు	5,310
నల్లవి	8,245
గొర్రెలు	18,424
మేకలు	8,865
కోళ్లు	18,258

సకాలంలో చికిత్స చేయించాలి



పశువుల్లో అనారోగ్యాన్ని గుర్తించిన వెంటనే సమీపంలోని పశు వైద్యులను సంప్రదించి చికిత్స చేయించాలి. వర్షాకాలంలో పశువులకు కాలానుగుణ వ్యాధులు సోకే అవకాశం ఎక్కువ. ఏదైనా వ్యాక్సిన్ వేయిస్తే దాని ప్రభావం ఆరు నెలల వరకు ఉంటుంది. నట్టల నివారణ మందులను ఆరు నెలలకోసారి వేస్తాం. గొంతువాపు, చిటుకు వ్యాధులకు ఉచితంగా వ్యాక్సిన్ అందిస్తున్నాం. పశు సంరక్షణపై ఎలాంటి సందేహాలున్నా పాడి రైతులు స్థానిక పశు వైద్య కేంద్రాల్లోని సిబ్బందిని సంప్రదించవచ్చు.

– డాక్టర్ సాయి హరిణి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, గడివేముల

సిటీ బస్సులు నడపాలి

కల్లూరు: కర్నూలు నగరంలో సిటీ బస్సులు నడపాలని బీజేపీ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ కొట్టే చెన్నయ్య శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కర్నూలు నగర జనాభా ఆరున్నర లక్షలు దాటిందని ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోయిందని పేర్కొన్నారు. 1990 సంవత్సరంలోనే రెండు లక్షల జనాభా ఉన్న సమయంలో సిటీబస్సులు నడిపారని గుర్తుచేశారు. ప్రస్తుతం నగరంలో దాదాపు 40 వేల ఆటోలు, లక్షన్నర ద్విచక్ర వాహనాలు, కార్లు ఉన్నాయని, ఇతర ప్రాంతాల నుంచి నగరానికి 60 వేల మంది వస్తుంటారని దీని వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. రోడ్లన్నీ ఆటోలు, ద్విచక్ర వాహనాలతో నిండి పోతున్నాయని, దీంతో సీనియర్ సిటిజన్లు, స్త్రీలు, విద్యార్థులు, బాలికలు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. నగర ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు స్పందించి నగరంలో సిటీ బస్సులు నడపాలని కోరారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ అధికారులు చేపట్టనున్న అభివృద్ధి పనుల కారణంగా కింగ్ మార్కెట్, చేపల మార్కెట్, ఖల్లా వీధి, మద్వా వీధి, జామియా మసీదు, విద్యా నగర్, గాంధీ నగర్, హబీబ్ ముబారక్ నగర్, పింజి మిషన్ ఏరియా, బంగి అనంతయ్య కాలనీ, సంపత్ నగర్, మహవీర్ నగర్, చల్లావారి వీధి, తిలక్ నగర్, ఆర్టీసీ కొత్త బస్టాండ్, ఇందిరా గాంధీ నగర్, కల్లూరు రోడ్డు, పెద్దపాడు తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

వార్డు స్థానాలకు నేడు పోలింగ్


ఉల్చాలలో ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎన్నికల విధులకు హాజరైన సిబ్బంది

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో శనివారం 11వ వార్డు మెంబర్ స్థానానికి పోలింగ్ నిర్వహించనున్నట్లు కర్నూలు ఎంపీడీఓ, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్ అజాంఖాన్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉల్చాల గ్రామంలో 11వ వార్డుకు సంబంధించి 418 మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. ఈ నెల 19వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ ఉంటుందన్నారు. స్టేజ్–2 అధికారిగా కర్నూలు రూరల్ ఎంఈఓ–2 కె.వినోద్‌కుమార్ వ్యవహరిస్తున్నారని, 2 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభమవుతుందన్నారు. కౌంటింగ్ పూర్తయ్యాక ఫలితాలను వెల్లడిస్తామని వివరించారు. ఎన్నికలకు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేశామని, స్టేజ్–2 అధికారితో పాటు ఒక ప్రొసీడింగ్ ఆఫీసర్, పోలీసు బందోబస్తు మధ్య ఎన్నికలు నిర్వహించనున్నామని స్పష్టం చేశారు.

కౌలూరులో..

పాణ్యం: మండల పరిధిలోని కౌలురు గ్రామంలో ఖాళీ ఏర్పడిన 5వ వార్డు మెంబర్ స్థానానికి శనివారం పకడ్బందీగా పోలింగ్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈఓఆర్డీ భాస్కర్‌రావు తెలిపారు. ఆర్ఓతో పాటు, పీఓ, ఏపీఓ అధికారులు ఎన్నికల విధులు నిర్వహించనున్నారు. 5వ వార్డుకు సంబంధించి మొత్తం 99 ఓట్లు ఉన్నాయి. మధ్యాహ్నం వరకు పోలింగ్ తదనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టి విజేతను ప్రకటించనున్నారు. పోలింగ్ సందర్భంగా పోలీసులు పటిష్ఠం బందోబస్తు ఏర్పాటు చేశారు. ఓటు హక్కు వినియోగించుకునే వారు ఓటరు స్లిప్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలన్నారు.

నేడే ఉప ఎన్నిక

కోడుమూరు రూరల్: మండలంలోని గోరంట్ల గ్రామంలో వార్డు మెంబర్–6, ప్యాలకుర్తి గ్రామంలోని వార్డు మెంబర్–1 స్థానానికి శనివారం ఎన్నికలను నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. గోరంట్ల వార్డు మెంబర్–6 స్థానానికి పుల్లగుమ్మి శ్యామల, లక్ష్మీదేవి, లాలెమ్మ పోటీ పడుతుండగా, ప్యాలకుర్తి వార్డు మెంబర్–1 స్థానానికి సంగాల సుగుణమ్మ, సంజపోగు సుశీలమ్మలు పోటీలో ఉన్నారన్నారు. ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓట్ల పోలింగ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు, విజేతల ప్రకటింపు ఉం టుందన్నారు. ఆయా గ్రామాల్లోని పోలింగ్ బూతులను శుక్రవారం సాయంత్రం సందర్శించి పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామగ్రిని అందజేసినట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు.

పోలింగ్ స్టేషన్లకు సామగ్రి తరలింపు


ఎన్నికల అధికారులకు పోలింగ్ సామగ్రిని అప్పగిస్తున్న ఎంపీడీఓ శివనాగప్రసాద్

ఓర్వకల్లు: మండలంలోని ఖాళీ ఏర్పడిన 3 వార్డు సభ్యుల స్థానాలకు శనివారం పోలింగ్ జరగనున్న నేపథ్యంలో శుక్రవారం బ్యాలెట్ బాక్సులను ఆయా పోలింగ్ స్టేషన్లకు తరలించినట్లు ఎంపీడీఓ శివనాగప్రసాద్ తెలిపారు. మండలంలోని ఓర్వకల్లు, శకునాల, బ్రాహ్మణపల్లె గ్రామాలలో ఒక్కొక్కటి చొప్పున మూడు వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. పోటాపోటీగా జరుగనున్న ఈ ఎన్నికలకు స్టేజ్–2, పీఓలు, పోలింగ్ సిబ్బందిని నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. ఓర్వకల్లుకు స్టేజ్–2 అధికారిగా సుబ్బరాయుడు (ఈఓఆర్‌డీ), సొండింగ్ ఆఫీసర్‌గా సరళాదేవి (ఏఎస్ఓ)ను నియమించినట్లు తెలిపారు. అలాగే శకునాలకు స్టేజ్–2 అధికారిగా మురళీకృష్ణ (ఆర్‌డబ్ల్యూఎస్), పీఓగా రంగస్వామి (ఆర్‌ఐ), బ్రాహ్మణపల్లెకు స్టేజ్–2 అధికారిణిగా నాగమణి (ఆర్‌డబ్ల్యూఎస్), పీఓగా మనోహర్‌ను నియమించినట్లు ఆయన వెల్లడించారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ ఉంటుందని, అనంతరం లెక్కింపు చేపట్టి విజేతలను ప్రకటించనున్నారు. బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్స్‌లు, లక్క తదితర పోలింగ్ సామగ్రిని సంబంధిత స్టేజ్–2 ఆఫీసర్లకు అప్పగించినట్లు ఎంపీడీఓ తెలిపారు.

టార్పాలిన్లను గుట్టుగా అమ్మేశారు

- మార్కెట్‌యార్డులో వెలుగుచూసిన దందా
- టార్పాలిన్లు బయట అమ్మి సొమ్ము చేసుకున్న అవుట్‌సోర్సింగ్ సిబ్బంది
- విచారణలో వెలుగు
- నిఘాలేని జేఎంఎస్ నరసయ్యకు మెమో జారీ
- మధుసూదన్ రెడ్డి, మరో ఇద్దరు తాత్కాలికంగా సస్పెండ్

కర్నూలు(అగ్రికల్చర్): మార్కెట్ యార్డులో విక్రయానికి రైతులు పంట ఉత్పత్తులు తీసుకొస్తుంటారు. హఠాత్తుగా వర్షం పడితే అవి తడిసిముద్దయితాయి. దీని వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారు. ఈ పరిస్థితి తలెత్తకుండా వర్షం పడేటప్పుడు పంట ఉత్పత్తులను కప్పేందుకు కర్నూలు మార్కెట్‌యార్డు అధికారులు తెప్పించిన టార్పలిన్లను అదే యార్డులో పనిచేసే కొందరు గుట్టుగా విక్రయించారు. ఒకటి కాదు...రెండు కాదు... ఏకంగా 45 టార్పాలిన్లను మార్కెట్ యార్డు నుంచి బయటకు తరలించి సొమ్ము చేసుకున్నారు. ఇటీవల మార్కెట్ కమిటీ సెక్రటరీ గోవిందు యార్డులో తిరుగుతున్న సమయంలో ఈ విషయం వెలుగుచూసింది. అవుట్‌సోర్సింగ్‌పై పని చేసే ఇద్దరు సెక్యూరిటీలు టార్పాలిన్‌లను బయటకు పంపి అమ్ముకున్నారని కొందరు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. లోతుగా ఆరా తీయగా 45 టార్పాలిన్లు అమ్మేసుకున్నట్లు నిర్ధారణ అయింది. సాధారణంగా టార్పాలిన్లు జూనియర్ మార్కెట్ సూపర్‌వైజర్ కంట్రోల్‌లో ఉంటాయి. ఆయన పట్టించుకోకుండా ఉన్నందుకు జేఎస్ఎస్ నరసయ్యకు మెమో జారీ చేశారు. అలాగే టార్పాలిన్లను బయటకు తరలించి అమ్ముకోవడంతో కీలకంగా వ్యవహరించిన సెక్యూరిటీ మధుసూదన్ రెడ్డితో పాటు మధు అనే మరో సెక్యూరిటీ, కృపాకర్ అనే ట్రాక్టర్ డ్రైవర్‌కు నోటీసులు ఇచ్చి తాత్కాలికంగా మూడు రోజుల పాటు సస్పెండ్ చేసి బయటికి పంపారు. నోటీసులకు సమాధానం ఇచ్చిన తర్వాత వారిపై తీవ్రమైన చర్యలు ఉంటాయని సెక్రటరీ గోవిందు తెలిపారు. కాగా గుట్టుగా టార్పాలిన్లను అమ్మేసుకున్న సెక్యూరిటీ సిబ్బంది.. డబ్బు వెనక్కి కడుతాము... మాపై కఠిన చర్యలు వద్దంటూ పైరవీ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై పాలక వర్గం గుర్రుగా ఉన్నట్లు సమాచారం. ఈ సెక్యూరిటీ సిబ్బంది అక్రమాలు వెలుగులోనికి రానివి అనేకం ఉన్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలి

సి.బెళగల్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ మండల అధ్యక్షుడు రబీరసూల్ కోరారు. శుక్రవారం ముడుమాల, బురాన్‌దొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భోజన నిర్వహణ తీరును పరిశీలించారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని, బీవై రామయ్య
- 19వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'
- ప్రజల్లో అపూర్వ స్పందన


సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ రామయ్య

కల్లూరు: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిలో సువర్ణాధ్యాయాన్ని లిఖించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మేయర్ బీవై రామయ్య కోరారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 19వ వార్డు సోమిశెట్టి నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మేయర్ కాలనీలో విస్తృతంగా పర్యటిస్తూ, సంక్షేమ పథకాలను వివరిస్తు బుక్‌లెట్లను పంపిణీ చేశారు. కాలనీలో ఎమైనా సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలన్నారు. సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కావాలి: ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గత నాలుగేళ్లుగా జరిగిన అభివృద్ధి,సంక్షేమమే తమ ఆయుధాలుగా ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని సూచించారు. నగరంలోని 19వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతరో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు.

దిగ్విజయంగా కార్యక్రమం:

నగరంలోని 19వ వార్డులో రెండు వారాలుగా జరు గుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దిగ్విజయంగా ముగియడంతో వార్డులోని వైఎస్సార్‌సీపీ నాయకులుసంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి వచ్చిన విశేష స్పందనతో ప్రతిపక్ష నాయకులు చేసినవన్నీ అవన్నీ అసత్య ఆరోపణలే అని తేటతెల్లమైందన్నారు. వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, డీఏఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, నారాయణరెడ్డి, నాయకులు హనుమంతు రెడ్డి, శివరాం, బాలచంద్రరెడ్డి, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న హయాంలోనే సంక్షేమ పాలన

- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్


బైన్‌దొడ్డిలో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కోడుమూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే సంక్షేమ పాలన సాగుతోందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన శుక్రవారం మండలంలోని బైన్‌దొడ్డి గ్రామంలో పర్యటించారు. నాలుగేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి, బుక్‌లెట్ అందజేశారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. శ్మశాన వాటిక, తాగునీరు, కరెంట్ స్తంభాలు, సీసీ రోడ్లు, మురుగునీటి కాల్వలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు విన్నవించారు. శ్మశాన వాటిక విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మిగతా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల, మతం, రాజకీయాలకు అతీతంగా పాలన సాగిస్తున్న జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీనివాసులు, మార్కెట్‌యార్డు డైరెక్టర్ ఇమ్మానేయులు, వైఎస్సార్‌సీపీ నేతలు సత్యారెడ్డి, లాయర్ ప్రభాకర్, నరసింహులు, నాగేంద్ర, గిడ్డయ్య, సూరి, సోమశంకర్‌యాదవ్, బలరాం పాల్గొన్నారు.

నేడు కోడుమూరులో..

కోడుమూరులోని 2వ సచివాలయం పరిధిలోని శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే సుధాకర్ సంక్షేమ పథకాలను ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు వివరించడంతో పాటు, సమస్యలను తెలుసుకుంటారన్నారు. మండల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని సూచించారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

గూడూరు: కె.నాగలాపురం–పెంచికలపాడు గ్రామాల మధ్య ఉన్న చెరువు భూములను కొందరు ఆక్రమించుకుని వేరేవారికి లీజుకిచ్చారని, అందుకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. పెంచికలపాడు సమీపంలో చెరువు కట్టను ధ్వంసం చేసి చదువును చేయడాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ చెరువు భూమిని కొందరు ఆక్రమించి రెవెన్యూ అధికారుల సహకారంతోనే పవన విద్యుత్ తయారు చేసే వారికి లీజుకు ఇచ్చారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ పూర్తి స్థాయిలో విచారించి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు నారాయణ, నాయకులు మోహన్, ఓంకారం, ఎర్రమల, రవి, అయ్యన్న, దేవరాజు, ప్రతాప్ పాల్గొన్నారు.

విద్యుత్ పనులు వేగవంతం చేయండి

కర్నూలు(రాజ్‌విహార్): జగనన్న కాలనీల్లో చేపడుతున్న విద్యుత్ పనులు వేగవంతం చేయాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి అన్నారు. శుక్రవారం స్థానిక విద్యుత్ భవన్ నుంచి ఆయన కింది స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. విద్యుత్ సబ్ స్టేషన్లతో పాటు ఇతర అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని చెప్పారు.

హత్యాయత్నం కేసు నమోదు


కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగరాజును పరిశీలిస్తున్న ఎస్‌ఐ నల్లప్ప

కల్లూరు: ఉలిందకొండ పోలీసు స్టేషన్ పరిధిలోని చిన్నటేకూరు గ్రామానికి చెందిన వ్యక్తిపై హత్యాయత్నం కేసు నమోదైంది. ఎస్‌ఐ నల్లప్ప తెలిపిన వివరాల మేరకు.. గురువారం రాత్రి చిన్నటేకూరు గ్రామంలో.. కృష్ణానగర్‌కు చెందిన బోయ నాగరాజు మిత్రులతో కలిసి దాసరి రామకృష్ణ కల్లందొడ్డి పక్కన ఉన్న రోడ్డుపై మాట్లాడుకుంటున్నారు. అదే గ్రామానికి చెందిన బోయ రంగన్న తన భార్యతో నాగరాజుకు వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో కొడవలితో దాడికి ప్రయత్నించాడు. అక్కడే ఉన్న దాసరి రామకృష్ణ, బోయ రామాంజనేయులు అడ్డుకున్నారు. గాయపడిన నాగరాజును బంధువులు, మిత్రులు కలిసి ఆటోలో మెయిన్‌రోడ్డు వరకు వచ్చి అక్కడి నుంచి కారులో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలులోని కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. నాగరాజు తమ్ముడు విజయ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

దోమలను నివారించాలి


సుద్దవాగును పరిశీలిస్తున్న డీఐఓ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): కాలనీల్లో దోమలు పెరగకుండా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఆయన స్థానిక డాక్టర్ కాలనీలోని యూపీహెచ్‌సీ పరిధిలో ఉన్న అరోరానగర్ సచివాలయంలో జరుగుతున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు గృహ సందర్శనాలు చేసి నీటి నిల్వలు లేకుండా అవగాహన కల్పించి దోమల పెరుగుదల అరికట్టేలా చూడాలన్నారు. దీనివల్ల దోమల వ్యాప్తి ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టవచ్చన్నారు. ఎవ్వరైనా జ్వరలక్షణాలు కలిగి ఉంటే వారికి నిర్ధారణ పరీక్షలు చేసి తగు చికిత్సలు ఇవ్వాలని ఆదేశించారు. ఆ వివరాలను ఫ్రైడే డ్రైడే యాప్‌లో అప్‌లోడ్ చేయాలని, అంతేగాక నీటి నిల్వలు, చెత్తకుప్పలు ఉన్న ప్రాంతాలను ఫోటో తీసి వెక్టార్ కంట్రోల్ హైజీన్ యాప్‌లో అప్‌లోడ్ చేసి పంచాయతీ సిబ్బంది సమన్వయంతో వాటిని తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహాలక్ష్మి, కార్పొరేటర్ మొహిద్దీన్, డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్ పాల్గొన్నారు.